



సాలూరులో పంచముఖేశ్వరునికి అభిషేకం చేస్తున్న అర్చకుడు

శివోహం

- భక్తిశ్రద్ధలతో శివరాత్రి పూజలు
- శైవ క్షేత్రాలు, గుహాలయాలకు పోటెత్తిన భక్తులు
- మార్మోగిన శివ నామస్మరణ




భామిని: పెద్దదిమిలిలో ఎండల మల్లికార్జునుడికి పూజలు చేస్తున్న దృశ్యం

పార్వతీపురం/పాలకొండ/సాలూరు/సాలూరురూరల్/కొమరాడ/భామిని/పాచిపెంట, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా జిల్లాలో శైవక్షేత్రాలు, గుహాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. భక్తులతో కిటకిటలాడాయి. బుధవారం వేకువజామునే శివాలయాలకు చేరుకున్న భక్తజనం గంటల కొద్దీ క్యూలైన్లలో నిరీక్షించారు. అనంతరం ముక్కంటిని దర్శించుకుని పులకించి పోయారు. ఉపవాసాలతో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. శంభో శంకర.. కరుణించు అంటూ వేడుకున్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. జిల్లాలోని కొన్నిచోట్ల భక్తజనం తలనీలాలు సమర్పించి.. మొక్కులు తీర్చుకున్నారు. ఇంకొన్నిచోట్ల కన్నుల పండువగా శివ పార్వతుల కల్యాణం నిర్వహించారు. పాచిపెంట మండలంలోని చెరుకుపల్లి సమీపంలో గల పారమ్మ కొండ వద్ద జాతర ఘనంగా జరిగింది. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఒడిశా నుంచి పెద్దఎత్తున భక్తులు పారమ్మ కొండపై ఉన్న పారమ్మ తల్లి దర్శించుకోవటానికి తరలివచ్చారు. కాగా సాలూరు నుంచి 125 బస్సులు నడిపారు. కొమరాడ మండలం గుంప సోమేశ్వరస్వామి ఆలయానికి కూడా పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. నాగావళి-జంఝావతి నదుల సంగమం శివనామస్మరణతో మార్మోగింది. కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, జేసీ శోభిక సోమేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. రెండు రోజుల పాటు జరిగే జాతరకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పాల కొండలో సనారీశ్వర ఆలయానికి భక్తులు పోటెత్తారు. భామిని మండలం పెద్దదిమిలి ఎండల మల్లికార్జునుడికి భక్తులు పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కొత్తూరు, సీతంపేట, ఒడిశా నుంచి భారీ సంఖ్యలో ప్రజలు చేరుకొని మొక్కులు చెల్లించారు. సాలూరు పంచముఖేశ్వర ఆలయంలో రుద్రాభిషేకాలు నిర్వహించారు. అనంతరం అఖండజ్యోతిని వెలిగించారు. గుహాలయాల్లోనూ ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. లింగోద్భవ పూజ, ప్రత్యేక హారతి కార్యక్రమాలకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. మొత్తంగా అంతటా ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది.



పూజలందుకున్న పారమ్మతల్లి



పాచిపెంట : పారమ్మకొండపై భక్తజనం ఇలా..



కొమరాడ: గుంప సోమేశ్వరుడి ఆలయం వద్ద నాగావళి - జంఝావతి నదుల సంగమంలో భక్తుల సందడి

సీతంపేటలో చిమ్మచీకట్లు

- వెలగని సెంట్రల్ లైటింగ్
- ప్రజలకు తప్పని ఇబ్బందులు
- చోద్యం చూస్తున్న అధికారులు

సీతంపేట రూరల్, ఫిబ్రవరి26 (ఆంధ్రజ్యోతి): సీతంపేటలో చిమ్మచీకట్లు కమ్ముకున్నాయి. గడిచిన కొద్ది రోజులుగా మండల కేంద్రంలో సెంట్రల్ లైటింగ్ వెలగడం లేదు. దీంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. అధికార యంత్రాంగం కూడా తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వాస్తవంగా గత టీడీపీ ప్రభుత్వ హయాంలో సుందర సీతంపేటలో భాగంగా లక్షలు వెచ్చించి సెంట్రల్ లైటింగ్‌ను ఏర్పాటు చేశారు. అయితే వైసీపీ ప్రభుత్వం వాటి నిర్వహణను గాలికొదిలేసింది. దీంతో లైట్లు మరమ్మతులకు గురయ్యాయి. కొన్ని లైట్లు ఇటీవల కాలంలో పూర్తిగా వెలగకపోవడంతో సీతంపేటలో చీకట్లు కమ్ముకున్నాయి. సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ గడచిన కొన్ని రోజులుగా ఇబ్బందులు పెడుతున్నా అటు ఐటీడీఏ కానీ ఇటు పంచాయతీ అధికారులు కానీ పట్టించుకోకపోవడంపై సీతంపేట వాసులు మండి పడుతున్నారు. తక్షణమే వాటికి మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని వారు కోరుతున్నారు.దీనిపై ఎంపీడీవో కె.గీతాంజలిని వివరణ కోరగా లైట్లు ఎందుకు పనిచేయడం లేదో పరిశీలిస్తామన్నారు. గతంలో కూడా ఇటువంటి సమస్య వస్తే సరిచేయించామని తెలిపారు. త్వరలోనే సెంట్రల్ లైటింగ్ సమస్యను పరిష్కరిస్తామని ఆమె చెప్పారు.



చీకట్లో సీతంపేట ప్రధాన రహదారి

నిధులు మంజూరుకాక..
నిర్మాణానికి నోచుకోక
- రాళ్లు తేలి గోతులమయమైన వైనం
- ఇదీ దశమంతుపురం-పెద్దబుడ్డిడి రహదారి దుస్థితి
8లో



జాతరలు ఐక్యతకు చిహ్నాలు
- మంత్రి కొండపల్లి శ్రీనివాస్
7లో



పులి సంచరిస్తోందని..
- శివరాం గ్రామస్థుల ఆందోళన



పులకించిన పుణ్యగిరి

శృంగవరపుకోట,ఫిబ్రవరి26(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా శృంగవరపుకోట పుణ్యగిరికొండ బుధవారం శివ నామ స్మరణతో పులకించింది. మహాశివరాత్రి కావడంతో భక్తులు తెల్లవారుజాము నుంచే కొండపైకి క్యూ కట్టారు. 20వేల మంది వరకు భక్తులు ఉమాకోటి లింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. తొలుత దారగంగమ్మ లోయ, పుట్ట దారల వద్ద పుణ్య స్నానాలు ఆచరించారు. దేవిబొమ్మ కూడలి నుంచి పుణ్యగిరి కొండ వరకు ఆర్టీసీ ప్రత్యేకంగా బస్సులను నడుపుతోంది. కాగా శివరాత్రి రోజున వచ్చిన భక్తులకంటే నాలుగు రెట్లు అధికంగా మరుసటి రోజు కొండపై కనిపించనున్నారు. ఈ ఏడాది లక్ష ఐదు వేల మంది భక్తులు వస్తారని అధికారులు అంచనా వేశారు.

రామతీర్థంలో ...

నెల్లిమర్ల: రామతీర్థం రామ, శివ నామస్మరణలతో మార్మోగింది. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జరిగిన జాతరకు విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. తొలుత రామకోనేరులో పుణ్యస్నానాలు చేసి సీతారాములను, ఉమా సదాశివ స్వామిని దర్శించుకుని పులకించిపోయారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. బుధవారం సాయంత్రం బోడి కొండపై అఖండ జ్యోతిని వెలిగించారు.



రామతీర్థం దేవస్థానంలో బారులుదీరిన భక్తులు

నేడే ఎమ్మెల్సీ ఎన్నిక

- ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పోలింగ్
- ఆరు జిల్లాల్లో 22,496 మంది ఓటర్లు
- పోలింగ్ కేంద్రాలు 123
- పోలింగ్ సిబ్బంది 739 మంది
- 3న ఓట్ల లెక్కింపు

విశాఖపట్నం/పార్వతీపురం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి):ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి గురువారం పోలింగ్ జరగనుంది. ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభమై సాయంత్రం నాలుగు గంటలకు ముగియనుంది. అందుకు తగిన ఏర్పాట్లు అధికారులు పూర్తిచేశారు. ఈ ఎన్నికకు రిటర్నింగ్ అధికారిగా విశాఖ కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ వ్యవహరిస్తుండగా, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల రెవెన్యూ అధికారులు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులుగా ఉన్నారు. ఆరు జిల్లాల పరిధిలో 22,493 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 13,508 మంది, మహిళలు 8,985 మంది ఉన్నారు. పోలింగ్ కోసం ఆరు జిల్లాల పరిధిలో 123 కేంద్రాలు ఏర్పాటుచేశారు. ఎన్నికల నిర్వహణకు 739 మంది అధికారులను నియమించారు. వీరిలో 148 మంది పీవోలు, 148 మంది ఏపీవోలు, 295 మంది ఓపీవోలు ఉన్నారు. మరో 148 మంది మైక్రో అబ్జర్వర్లును నియమించారు. ఎన్నికల సిబ్బంది, మెటీరియల్‌ను బుధవారం సాయంత్రానికే కేంద్రాలకు తరలించారు. ఎన్నిక బ్యాలెట్ విధానంలో నిర్వహిస్తున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేశారు. కాగా ఈ ఎన్నికల్లో ఓటరు ప్రాధాన్యతా క్రమంలో ఓటు హక్కు వినియోగించుకోవచ్చు. ఉదాహరణకు ఒక అభ్యర్థికి మొదటి ప్రాధాన్య ఓటు వేస్తున్నట్టు అయితే పేరుకు ఎదురుగా ఉన్న గడిలో 'ఒకటి' అని నంబరు వేయాలి. అంతే తప్ప టిక్‌లు పెట్టరాదు. ఓటరుకు బ్యాలెట్ పేపరుతోపాటు స్కెచ్ పెన్ను ఇస్తారు. ఆ పెన్ మాత్రమే ఉపయోగించి ఓటువేయాలి తప్ప ఇతర పెన్నులు వాడరాదు.

పోటీలో ఉన్న అభ్యర్థులు...

సిట్టింగ్ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, కోరెడ్ల విజయగౌరి, గాదె శ్రీనివాసులనాయుడు, కోసూరు రాధాకృష్ణ, నూకల సూర్యప్రకాష్, రాయల సత్యనారాయణ, సత్తలూరి పద్మావతి, పెదపెంకి శివ ప్రసాద్, పోతల దుర్గాప్రసాద్, సుంకర శ్రీనివాస రావు (ఈయన పోటీ నుంచి తప్పుకుంటున్నట్టు వారం కిందట ప్రకటించారు)

మూడో తేదీన ఓట్ల లెక్కింపు

ఎన్నికలలో కీలకమైన పోలింగ్ గురువారం సాయంత్రం నాలుగు గంటలతో ముగియనుంది. బ్యాలెట్ బాక్సులను సాయంత్రం ఆరు గంటల తరువాత ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలలోని ఈఈఈ విభాగం బ్లాక్‌లో భద్రపరుస్తారు. జిల్లాల నుంచి గురువారం రాత్రికి బ్యాలెట్‌బాక్సులు వస్తాయి. వచ్చే నెల మూడో తేదీన ఓట్ల లెక్కింపు జరుగుతుంది. దీనికి సంబంధించి కౌంటింగ్ సిబ్బందికి రెండు రోజుల్లో శిక్షణ ఇవ్వనున్నారు.



బస్సులో పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న సిబ్బంది



ముగ్గురి మధ్య ప్రధాన పోటీ

బరిలో పది మంది అభ్యర్థులు ఉండగా ముగ్గురి మధ్యే ప్రధాన పోటీ నెలకొంది. సుంకరి శ్రీనివాసరావు పోటీ నుంచి తప్పుకుంటున్నట్టు వారం కిందట ప్రకటించారు. ఆయన రఘువర్మకు మద్దతు పలికారు. కాగా సిట్టింగ్ ఎమ్మెల్సీ పి.రఘువర్మకు

(మిగతా 8వ పేజీలో...)

సర్వం సిద్ధం

- మెటీరియల్ పంపిణీ పూర్తి
- 15 పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లిన అధికారులు
- జిల్లాలో నిషేధాజ్ఞలు
- కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ వెల్లడి

పార్వతీపురం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికకు సర్వం సిద్ధం చేసినట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. గురువారం జిల్లా వ్యాప్తంగా పోలింగ్ జరగనున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జరిగిన పోలింగ్ మెటీరియల్ పంపిణీ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. జేసీ, సబ్ కలెక్టర్, డీఆర్‌వోకు పలు సూచనలిచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 'జిల్లాలోని 15 మండలాల్లో ఉన్న అన్ని పోలింగ్ కేంద్రాలకు మెటీరియల్ పంపిణీ చేశాం. ఎన్నికల దృష్ట్యా జిల్లాను ఆరు జోన్లుగా విభజించాం. సెక్టోరియల్ అధికారుల ఆధ్వర్యంలో పోలింగ్ మెటీరియల్‌తో ఎన్నికల అధికారులు, సిబ్బంది కేంద్రాలకు తరలివెళ్లారు. గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ప్రతి కేంద్రంలో పోలింగ్ జరగనుంది. మొత్తంగా 2,333 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారు. వారంతా ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇప్పటికే వారందరికీ ఓటరు స్లిప్పులను కూడా పంపిణీ చేశాం. పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేశాం. దివ్యాంగుల కోసం పోలింగ్ కేంద్రాల వద్ద షామియానాలు, తాగునీరు వంటి సిద్ధం చేశాం. పోలింగ్ ముగిసే వరకు జిల్లాలో ప్రత్యేక నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయి. గుమిగూడడం, సభలు, ర్యాలీలు వంటివి చేయరాదు. రాజకీయ పార్టీల పోస్టర్లు, కరపత్రాలు, బ్యానర్లు వంటి వాటిపై కూడా నిషేధ ఆంక్షలు వర్తిస్తాయి.' అని ఆయన వెల్లడించారు.



అధికారులకు, సిబ్బందికి సూచనలిస్తున్న కలెక్టర్

సర్వం శివమయం

- శివాలయాల్లో భక్తుల బారులు



రాజాం రూరల్: రాజాంలోని కన్యకాంబ ఆలయంలో..

శివరాత్రి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న శైవాలయాలకు భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే స్వామి దర్శనానికి బారులు తీరారు. ఆలయాల్లో రుద్రాభిషేకాలు చేశారు. శివాలయాలను నిర్వాహకులు విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. బుధవారం అర్ధరాత్రి లింగోద్భవ కాలంలో ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాల్లోని ఆలయాలను ప్రజాప్రతినిధులు, అధికారులు దర్శించుకున్నారు.

-ఆంధ్రజ్యోతి బృందం



విజయనగరం: పశుపతినాథేశ్వర ఆలయంలో భక్తుల రద్దీ



మెంటాడ: జయతి మల్లికార్జున స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి సంధ్యారాణి



గజపతినగరం: మరుపల్లి శివాలయం వద్ద భక్తుల బారులు



శృంగవరపుకోట రూరల్: సన్యాసేశ్వరుని సన్నిధిలో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి



జామి: జామి స్వర్ణాకర్ష రాజరాజేశ్వరి ఆలయంలో నందీశ్వరునికి పంచామృతాభిషేకం



పూసపాటిరేగ: కొవ్వాడలో మహారుద్రాభిషేకంలో పాల్గొన్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి



గరివిడి: స్థానిక శివాలయంలో రుద్రాభిషేకాలు..



బొబ్బిలి శివాలయంలో భక్తులు



సంతకవిటి: వాల్తేరు మార్కండేశ్వర స్వామి ఆలయం వద్ద భక్తులు



రేగిడి: సంకిలి కాశీవిశ్వేశ్వర ఆలయంలో భక్తుల క్యూ..



తెర్లాం: నెమాలాం శివాలయంలో పూజలు చేస్తున్న మహిళలు



బొబ్బిలి రూరల్: కలవరాయిలో శివలింగం ఆకారంలో సిద్ధం చేసిన కలశాలు



కొత్తవలస: ఓం సదనంలో అభిషేకంలో పాల్గొన్న భక్తులు

న్యూస్ బాక్స్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విజయనగరం రింగురోడ్డు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) పూల్‌బాగ్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కె.వి. ఫీడర్‌లో కండక్టర్ల మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఈఈ పి.త్రినాథ్‌రావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. లక్ష్మీగణపతి కాలనీ, సుబ్రహ్మణ్య స్వామి గుడి ఏరియ, జగదాంబ నగర్, గోల్డెన్ వ్యాలీ లే అవుట్ , పూల్‌బాగ్ కాలనీ మెయిన్ రోడ్డు, హాజీ అలీనగర్, మంగళవీధి కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

నీటి సరఫరా పునరుద్ధరణ

రేగిడి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): బొడ్డవలస పైలెట్ ప్రాజెక్టు ద్వారా రాజాం, రేగిడి మండలాల్లో 50 గ్రామాలకు నిలిచిపోయిన రక్షిత నీటి సరఫరా పునరుద్ధరణకు ఆర్‌డబ్ల్యూఎస్ యంత్రాంగం చర్యలు చేపట్టారు. మజ్జిరామునిపేట వద్ద మెయిన్ పైప్‌లైన్ లీక్ కావడంతో సరఫరా నిలిచిపోయిన సంగతి తెలిసిందే. దీనిపై ఈనెల 25న 'ఆంధ్రజ్యోతి'లో '50 గ్రామాలకు తాగునీటికి బ్రేక్' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై ఇక్కడి అధికారులకు ఉన్నతాధికారులు వివరణ కోరినట్లు సమాచారం. బుధవారం ఉదయం కొన్ని గ్రామాలకు అందించామని.. రాత్రికి నీటి సరఫరా పూర్తిగా పునరుద్ధరిస్తున్నట్లు ఏఈ శ్రీచరణ్ తెలిపారు.

సమగ్ర చట్టం అవసరం

రాజాం రూరల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): అసంఘటిత రంగ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర చట్టం చేయాలని రాజాం బజార్ కలాసీ యూనియన్ గౌరవాధ్యక్షులు రామ్మూర్తినాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికులతో బుధవారం ఆయన సమావేశమయ్యారు. ప్రభుత్వం అసంఘటిత రంగ కార్మికుల్ని కనీసం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వారి కోసం సమగ్ర చట్టం చేయాలని రామ్మూర్తినాయుడు విజ్ఞప్తి చేశారు.

కాకినాడ సమన్వయకర్తగా సురేష్‌బాబు

రాజాం రూరల్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): జనసేన కాకినాడ సమన్వయకర్తగా ఆ పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి పొగిరి సురేష్‌బాబును నియమిస్తూ అధినేత పవన్‌కల్యాణ్ ఉత్తర్వులు జారీ చేశారు. మార్చి 14న పిఠాపురంలో నిర్వహించనున్న జనసేన ఆవిర్భావ సభకు సంబంధించి మహిళలు, క్రియాశీల కార్యకర్తలు, జనసైనికులతో సమావేశాలు నిర్వహించనున్నారు.

ఆత్మను ఆరాధిస్తేనే మోక్షం

గంట్యాడ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఆత్మను ఆరాధిస్తే జీవుడు మోక్షం పొందుతాడని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి కమిటీ అధ్యక్షులు శంకరరావు అన్నారు. బుధవారం బుడతనాపల్లి, పెణసాం, చినమానాపురం గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారకార్యక్రమం నిర్వహించారు.

జాతరలు ఐక్యతకు చిహ్నాలు: మంత్రి

బొండపల్లి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): పల్లెల్లో నిర్వహించే జాతరలు ఐక్యతకు చిహ్నంగా నిలుస్తాయని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. కొత్తపాలెం గ్రామంలో బుధవారం కృష్ణమ్మతల్లి పేరంటాలు మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ జాతరల్లో భాగంగా క్రీడా పోటీలు నిర్వహించడం వల్ల నైపుణ్యాలు వెలుగులోకి వస్తాయన్నారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు మంత్రి బహుమతులు అందజేశారు. జిల్లా స్థాయి వాలీబాల్, కబడ్డీ, ఎడ్లబండ్ల పోటీలు, గుర్రపు పందాలు నిర్వహించారు. గజపతి నగరం సీఐ జీఏవీ రమణ, బొండపల్లి ఎస్‌ఐ యు.మహేష్, సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ బొడ్డు రాము, గ్రామ సర్పంచ్ బొడ్డు సత్యవతి , గంట్యాడ మాజీ ఎంపీపీ కొండపల్లి కొండలరావు, బొండపల్లి, గంట్యాడ టీడీపీ అధ్యక్షులు కోరాడ కృష్ణ, కొండపల్లి భాస్కరరావు, నాయకులు అర్జునరావు, నంబూరి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

వాతావరణ మార్పులతోనే విషజ్వరాలు: డీఎంహెచ్‌వో



పిల్లలను పరామర్శిస్తున్న డీఎంహెచ్‌ఓ జీవరాణి

శృంగవరపుకోట, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): వాతావరణ మార్పులతోనే విషజ్వరాలు వ్యాపిస్తున్నాయని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జీవరాణి పేర్కొన్నారు. దారపర్తి గిరిజన పంచాయితీ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన పిల్లలు జ్వరాల బారిన పడడంతో బుధవారం పత్రికల్లో వార్తలు వచ్చాయి. దీనికి స్పందించిన డీఎంహెచ్‌ఓ స్థానిక ప్రాంతీయ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 11 మంది పిల్లలను పరామర్శించారు. ఇవి దద్దుర్లుతో కూడిన సాధారణ జ్వరాలుగా గుర్తించారు. భయపడాల్సిన పనిలేదని బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. వీరికి అందుతున్న వైద్యం గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్య పరీక్షలు చేసేందుకు ప్రత్యేక బృందాలను ఇంటింటికీ పంపించారు. ఆమె వెంట కొట్టాం వైద్యాధికారి బి.శిరీష తదితరులు ఉన్నారు.

కదిలిన వైద్య సిబ్బంది

శృంగవరపుకోట రూరల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): దారపర్తి గిరిశిఖర గ్రామాల్లో విష జ్వరాలు వ్యాప్తి చెందాయని 'ఆంధ్రజ్యోతి'లో కథనం రావడంతో కలెక్టర్ అంబేడ్కర్ స్పందించారు. ఈ ఘటనపై పూర్తి స్థాయి నివేదిక ఇవ్వాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖను ఆదేశించారు. దీంతో యంత్రాంగం ఒక్కసారిగా కదిలింది. బుధవారం ఉదయం నుంచి దారపర్తి గిరిజన పంచాయతీలో ఉన్న గ్రామాలకు వైద్యసిబ్బంది పరుగులు తీశారు. వైద్యాధికారి హారిక ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించి.. మందులు అందించారు. డీఐఓ అచ్చుత కుమారి శనగపాడు గ్రామానికి వెళ్లారు. గిరిశిఖర గ్రామాల్లో పది రోజులు పాటు వైద్య శిబిరాలు కొనసాగుతాయని డీఐవో తెలిపారు.



శనగపాడులో వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న డీఐవో అచ్యుత కుమారి

ఎన్నికల నిర్వహణలో అప్రమత్తత అవసరం: జేసీ



అధికారులకు సూచనలిస్తున్న జేసీ సేతుమాధవన్

చీపురుపల్లి/గరివిడి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అప్రమత్తంగా ఉండాలని జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ ఆదేశించారు. బుధవారం చీపురుపల్లి ఆర్డీవో కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఎన్నికల నిర్వహణపై పోలీసు, రెవెన్యూ అధికారులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. గరివిడి మండలంలో కొండపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను, చీపురుపల్లి పట్టణంలో ఉన్న బాలుర హైస్కూల్‌ను అధికారులు ఇప్పటికే కేటాయించారు. గరివిడి మండలంలో 84 మంది, చీపురుపల్లిలో 123 మంది ఉపాధ్యాయులు ఓటుహక్కును వినియోగించుకోనున్నారు.

రఘువర్మ విజయానికి కృషి చేయండి: ఎమ్మెల్యే

రాజాం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి పాకలపాటి రఘువర్మను గెలిపించడానికి మండల స్థాయి నాయకులు కృషి చేయాలని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ కోరారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల కోసం నిరంతరం పోరాడే వ్యక్తి రఘువర్మను శాసనమండలికి పంపాలని కోరారు. గత ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను గాలికి వదిలేసిందన్నారు. నేడు కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయులకు ప్రతి నెల ఒకటో తేదీన జీతాలు అందించి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోందన్నారు. అనంతరం కూటమి నాయకులతో కలిసి రాజాం ప్రధాన రహదారి పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు నంది సూర్యప్రకాష్‌రావు, సుమల వెంకట మన్మథరావు, పిన్నింటి మోహన్‌రావు, గురవాన నారాయణరావు, అక్షుభుక్త కృష్ణమూర్తి, దుప్పలపూడి శ్రీనివాసరావు, బలిజిరెడ్డి శ్రీను, మడ్డు మణి, నాగళ్ల అప్పలనాయుడు, రౌతు వెంకటరమణ జనసేన నాయకులు యు.పి.రాజు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్

పులి సంచరిస్తోందని..



జంతువు అడుగులను పరిశీలిస్తున్న అధికారులు

గరివిడి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): శివరాం గ్రామానికి ఆనుకొని ఉన్న పొలాల్లో బుధవారం వేకువజామున పులి పిల్లలు సంచరించాయని గ్రామస్థులు ఆందోళనకు గురయ్యారు. పొలం పనులు చేయడానికి వెళ్లిన రైతులు తమ పొలాల్లో పులి అడుగులు ఉన్నాయని చెప్పారు. సమాచారం అందుకున్న గరివిడి తహసీల్దార్ బంగార్రాజు విజయనగరంలో ఉన్న అటవీ శాఖ అధికారులకు సమచారం ఇచ్చారు. రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు వెంటనే శివరాం గ్రామంలో ఉన్న పొలాల వద్దకు వెళ్లారు. అవి పులి అడుగులు కావని, హైనా పిల్లలుగానీ, అడవి పిల్లి పిల్లలైనా కావచ్చని తేల్చారు. దీంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

క్రైం న్యూస్

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య



సోములు (ఫైల్)

బొబ్బిలి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణంలోని ఎరుకలివీధికి చెందిన గేదెల సోములు (29) మంగళవారం రాత్రి మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ ఆర్.రమేష్ కథనం మేరకు.. టైల్స్ వర్కర్‌గా పనిచేస్తున్న సోములు అందరి దగ్గర మంచి వ్యక్తిగా పేరు సంపాదించుకున్నాడు. ఇటీవల ఆయనలో విపరీతమైన అసహనం, చిరాకు, కోపం పెరిగిపోయాయి. మంగళవారం కుటుంబసభ్యులు కలిసి శంబర పోలమాంబ మారు జాతరకు వెళ్లి అమ్మవారిని దర్శించుకొని తిరిగి ఇంటికి చేరుకున్నారు. దర్శన సమయంలో ఆలస్యం జరిగిందని భార్యాభర్తల మధ్య గొడవ ఇంటికి వచ్చే వరకూ జరిగింది. భార్య గంగమను తిట్టడమే కాకుండా తనలో తాను తిట్టుకుంటూ తీవ్ర అసహనానికి గురయ్యాడు.ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి కుటుంబసభ్యులు లేని సమయంలో ఇంట్లోని మొదటి గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు చీరతో ఉరిపోసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఇరుగుపొరుగువారి సహాయంతో స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. భార్య గంగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేశారు. సోములుకు భార్య, ఇద్దరు పిల్లలు, తల్లి ఉన్నారు. మృతదేహానికి బుధవారం సీహెచ్‌సీలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

విజయనగరం క్రైం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని జొన్నగుడ్డి ప్రాంతంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఎం.మోహన్‌రావును అదుపులోకి తీసుకుని 21 సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎన్‌ఫోర్స్ మెంట్ సి.ఐ. ఇందిరాదేవి ఓ ప్రకటనలో తెలిపారు. తదుపరి చర్యల నిమిత్తం వారిని విజయనగరం సర్కిల్ -1 టౌన్ స్టేషన్‌కు అప్పగించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్.ఐ. రాజశ్రీ , హెచ్‌సీ నాగేశ్వరరావు, ఈసీలు నాయుడు, భారతి పాల్గొన్నారు.

మాంసం విక్రేతలకు అపరాధ రుసుం

విజయనగరం రింగురోడ్డు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి రోజున మాంసం విక్రయాలు చేపట్టిన దుకాణ యజమానులకు నగర పాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య అపరాధ రుసుం విధించి.. దుకాణాలను మూసివేయించారు. బుధవారం నగరంలో ఆయన పలు చోట్ల పర్యటించారు. కొంతమంది మాంసవిక్రయాలు కొనసాగించడంతో ఒక్కో షాపునకు రూ.3వేల వేల వంతున అపరాధ రుసుం విధించారు. కంటోన్మెంట్ ఎస్.బి.టి. మార్కెట్‌ను ఆక్రమించి ఏర్పాటు చేసిన దుకాణాలను అక్కడి నుంచి తరలించారు.

రెండుచోట్ల అగ్ని ప్రమాదాలు

వంగర, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): వంగర, కింజంగి గ్రామాల్లో బుధవారం సంభవించిన అగ్ని ప్రమాదాల్లో గడ్డివాములు, ఒక ఇల్లు కాలి బూడిదయ్యాయి. వంగరలో సంభవించిన అగ్నిప్రమాదంలో రామినాయుడు, అసిరినాయుడు, కర్రి రాముకు చెందిన గడ్డివాములు బూడిదయ్యాయి. కింజంగిలో పంట గౌరమ్మకు చెందిన పెంకుటిల్లు అగ్నికి ఆహుతైంది. రాజాం అగ్నిమాపక సిబ్బంది మంటలు అదుపు చేశారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదాలు సంభవించినట్టు భావిస్తున్నారు.

ఇరువర్గాల కొట్లాటపై కేసు నమోదు

సంతకవిటి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఇరువర్గాల కొట్లాటకు సంబంధించి మండవకురిటికి చెందిన కొప్పుశెట్టి కోటీశ్వరరావు, పలిశెట్టి సీతయ్యలు పరస్పరం ఫిర్యాదులు చేయడంతో ఐదుగురు వ్యక్తులపై కేసులు నమోదు చేశామని హెచ్‌సీ వంజరాపు జనార్దనరావు బుధవారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కోటీశ్వరరావు పొలంలో సర్వే మొక్కలను సీతయ్యకు చెందిన నాటుబండ్లు కుమ్మేయడంతో గొడవ జరిగింది. పలిశెట్టి సీతయ్య, లక్ష్మణరావు, గోవిందరావు తనపై దాడి చేశారని కోటీశ్వరరావు ఫిర్యాదు చేశారు. మరోవైపు కోటీశ్వరరావు, శ్రీనులు తమపై దాడి చేశారని పలిశెట్టి సీతయ్య కూడా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు బుధవారం ఇరువర్గాలపై కేసులు నమోదు చేశామని హెచ్‌సీ వెల్లడించారు.

నేడే ఎమ్మెల్సీ ఎన్నిక

(ఐదో పేజీ తరువాయి)

కొన్ని ఉపాధ్యాయ సంఘాలతోపాటు టీడీపీ, జనసేన మద్దతు ప్రకటించాయి. మరో అభ్యర్థి గాదె శ్రీనివాసులనాయుడుకు కొన్ని ఉపాధ్యాయ సంఘాలు మద్దతు తెలిపాయి. అదేవిధంగా కూటమి భాగస్వామి అయిన బీజేపీకి చెందిన కొందరు నాయకులు సంఘీభావం ప్రకటించారు. కోరెడ్ల విజయగౌరికి వామపక్షాలకు అనుబంధంగా ఉండే ఉపాధ్యాయ సంఘాలు మద్దతు తెలిపాయి. సాంకేతికంగా బ్యాలెట్‌లో 10 మంది పేర్లు ఉండగా...వారిలో ఒకరు తప్పుకున్నారు. మిగిలిన తొమ్మిది మందిలో ప్రధానంగా పాకలపాటి రఘువర్మ, గాదె శ్రీనివాసులనాయుడు, కోరెడ్ల విజయగౌరి మధ్యే పోటీ ఉంది.

జిల్లాలో ఓటర్లు ఇలా..

జిల్లాలో 2,333 మంది ఓటర్లు ఉండగా.. ఇందులో పురుషులు 1,574 మంది, మహిళలు 759 మంది వరకు ఉన్నారు. గురువారం వారు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. మండలాల వారీగా చూస్తే.. వీరఘట్టంలో 120, సీతంపేటలో 121, భామిని 44, పాలకొండ 301, కొమరాడ 65, గుమ్మలక్ష్మీపురం 189, కురుపాం 120, జియ్యమ్మవలస 91, గరుగుబిల్లిలో 105 వరకు ఓట్లు ఉన్నాయి. పార్వతీపురం మండలం, పట్టణంలో 636, మక్కువలో 55, సీతానగరంలో 114, బలిజిపేట 88, సాలూరు 250, పాచిపెంట 34 వరకు ఓట్లు ఉన్నాయి. కాగా ఈ ఎన్నికకు సంబంధించి 18 మంది చొప్పున ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, సూక్ష్మ పరిశీలకులు, 36 మంది ఇతర పోలింగ్ అధికారులను నియమించారు.

ఓటర్ల వివరాలు...

జిల్లా	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	మహిళలు	మొత్తం
శ్రీకాకుళం	31	3,416	1,619	5,035
పార్వతీపురం మన్యం	15	1,574	759	2,333
విజయనగరం	29	3,270	1,953	5,223
అల్లూరి సీతారామరాజు	11	920	568	1,488
విశాఖపట్నం	13	2,539	2,990	5,529
అనకాపల్లి	24	1,789	1,096	2,885
మొత్తం	**123**	**13,508**	**8,985**	**22,496**

ప్రకృతి వ్యవసాయం విస్తరణకు కృషి: డీడీఎం



గరుగుబిల్లి: ప్రకృతి వ్యవసాయంపై మాట్లాడుతున్న బృందం సభ్యులు

గరుగుబిల్లి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ విస్తరణకు ప్రత్యేక కృషి చేయాలని నాబార్డ్ డీడీఎం దినేష్‌రెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని తోటపల్లి జట్టు ట్రస్ట్ అమలు చేస్తున్న కార్యక్రమాలను ఆప్కాబ్ జనరల్ మేనేజర్ల బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా దినేష్‌రెడ్డి మాట్లాడుతూ బడి నుంచి పొలంబడి వాచకాలతో భావితరాల వారికి వ్యవసాయ ఆవశ్యకతపై అవగాహన కలిగిందన్నారు. రసాయనిక ఎరువకలు స్వస్తి పలికి సేంద్రియ విధానాలను అమల్లోకి తెచ్చి ఆరోగ్యం సాధ్యపడేలా దృష్టి సారించారన్నారు. కార్యక్రమంలో ఆప్కాబ్ ప్రతినిధులు జీవీఎస్ రాజు, శ్రీవిద్య, ఎం.నూకంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అంతర పంటలతో భూసారం

గుమ్మలక్ష్మీపురం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి):అంతర పంటలతో భూసారం పెరుగుతుందని జట్టు ట్రస్టు కో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.నూకంనాయుడు తెలిపారు. బుధవారం మండలంలోని రాయగడ జమ్ము గ్రామంలో పువ్వుల ఆశమ్మ మామిడితోటలో క్యారెట్, ముల్లంగి, పాలకూర, గోంగూరు, మెంతికూర, చిక్కుడు, టమాటా తదితర అంతర పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాబార్డు ఆర్థికసహకారంతో జట్టు సంస్థ పర్యవేక్షణలో మండలంలోని 12 గ్రామాల్లో 150 మంది రైతులతో వారి పూర్తి విస్తీర్ణంలో పండ్ల తోటల్లో అంతర పంటల పండించే విధానంపై వివరించామన్నారు. కార్య క్రమంలో జీవ ప్రాజెక్టు కోఆర్డినేటర్ జి.ప్రబోధ్, జి.మురళీమోహన్ పాల్గొన్నారు.

'బడి నుంచి పొలంబడి' పరిశీలన

జట్టు ట్రస్టు ద్వారా డాక్టర్ డి.పారినాయుడు రూపొందించిన బడి నుంచి పొలం బడికి కార్య క్రమం నేటి తరానికి ఎంతో అవసరమని ఆప్కాబ్ ఏజీఎం జీవీఎస్.రాజు తెలిపారు. బుధవారం మండలంలోని మండ గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో బడి నుంచి పొలం బడికి కార్య క్రమంలో భాగంగా విద్యార్థులు సాగు చేస్తున్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయంలో శ త్రు, మిత్ర కీటకాలు,వాటిని గుర్తించడం, నివారణ చర్యలు చేపట్టడం వంటి అంశాలను విద్యార్థుల అవగాహన స్థాయిని పరీక్షించారు. కార్య క్రమంలో ఆప్కాబ్ జనరల్ మేనేజర్ కె.శ్రీవిద్య, సురేష్‌బాబు, తులసిధర్, జయశ్రీ, బడి నుంచి పొలంబడికి సిలబస్ కన్సల్టెంట్ తుంబలి శివాజీ, జట్టు కో-ఆర్డినేటర్ వి.సన్యాసిరావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తి మార్గంతో మానసిక ప్రశాంతత

పార్వతీపురంటౌన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): గీతలో శ్రీకృష్ణుడు చెప్పినట్లుగా భక్తిమార్గం ద్వారా మానసిక ప్రశాంతతో పాటు మెరుగైన జీవనం లభిస్తుందని హిందు ధర్మప్రచారకులు కె. రామ్మోహనరావు తెలిపారు. బుధవారం పార్వతీపురం శివారుల్లో గల శాన్యేశ్వరాలయ ప్రాంగణంలో మహాశివరాత్రి పురస్కరించుకొని గీతా పారాయణ సత్సంగ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆధ్యాత్మిక మార్గంలో పయనించడం ద్వారా ఇతరులకు సహాయ, సహకారలను అందించే గుణం అలవడుతుందన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి: సీఐ

బాడంగి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నిబంధనలను పోలీసు సిబ్బంది పాటించాలని బొబ్బిలి రూరల్ సీఐ నారాయణరావు తెలిపారు. బుధవారం బాడంగిలో విలేకరులతో మాట్లాడుతూ బొబ్బిలి సర్కిల్ లో గల బాడంగి, తెర్లాం, రామభద్రపురం పోలింగ్‌స్టేషన్ల పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. పోలింగ్ అధికారి అనుమతి లేకుండా బూత్‌లోకి పోలీసు సిబ్బంది ప్రవేశించరాదని తెలిపారు. ఎటువంటి గోడవలు జరిగినా వెంటనే అధికారులకు తెలియజేయాలని కోరారు.

రాయగడలో మహాశివరాత్రి పూజలు



రాయగడలో శివాలయం వద్ద బారులు తీరిన భక్తులు

ఒడిశా

రాయగడ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి):రాయగడ జిల్లాలో బుధవారం మహాశివరాత్రి భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో శైవమందిరాలు భక్తుల శివనామస్మరణతో మార్మోగాయి. అన్ని మందిరాలను భక్తులు, ప్రతినిధులు ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. ఉదయం నాలుగు గంటల నుంచి భక్తులు ఆలయాల్లో బారులు తీరారు. పలు సమాజ సేవా సంఘాల ప్రతినిధులు భక్తులకు మజ్జిగ, ప్రసాదం వితరణ వంటి కార్యక్రమాలు చేపట్టారు.

పోలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు

- సామగ్రితో కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది
- అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసుల బందోబస్తు



భామిని: పోలింగ్ కేంద్రం వద్ద చర్చిస్తున్న సిబ్బంది



గరుగుబిల్లి: పోలింగ్ కేంద్రానికి చేరిన ఎన్నికల సిబ్బంది



సాలూరు రూరల్: భద్రత ఏర్పాట్లు చేస్తున్న పోలీసులు

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. గురువారం జరిగే పోలింగ్‌కోసం సిబ్బంది కేంద్రాలకు బుధవారం చేరుకున్నారు.

● గరుగుబిల్లి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అవసరమైన సామగ్రి బుధవారం మండల కేంద్రానికి చేరింది. గురువారం ఎన్నిక జరగనున్న దృష్ట్యా ఏర్పాట్లను తహసీల్దార్ పి.బాల, ఎస్ఐ పి.రమేష్‌నాయుడు, ఉప తహసీల్దార్ బి.సుందరరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ గౌరీప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 44 పోలింగ్ కేంద్రాన్ని గరుగుబిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేశామని తెలిపారు. ఇక్కడ 105 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు చెప్పారు.ఎన్నిక పోలింగ్ ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు జరగనుందన్నారు. ఓటు హక్కు కలిగిన వారికి స్లిప్పులు పంపిణీ చేశామని తెలిపారు. పోలింగ్ కేంద్రంలో వెబ్ కాస్టింగ్ ఏర్పాటుతోపాటు ఓటర్లకు అసౌకర్యం కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టామన్నారు. ఎన్నిక దృష్ట్యా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

● గుమ్మలక్ష్మీపురం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భద్రగిరి గురుకుల పాఠశాల ఆవరణలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. ఇక్కడ విద్యుత్, తాగునీరు సదుపాయం కల్పించారు. పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేశామని ఎల్విన్‌పేట ఎస్ఐ తెలిపారు.

●భామిని, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహణకు భామిని జిల్లా పరిషత్ పాఠశాలకు ఎన్నికల అధికారులు బుధవారం చేరుకున్నారు. తహసీల్దార్ ఎన్.అప్పారావు, ఎస్ఐ అనీల్ కుమార్ పోలింగ్‌కు కేటాయించిన గదులను అప్పగించారు. ఎన్నికల సిబ్బంది ఓటర్లకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశారు. ఈ కేంద్రంలో 44 ఉపాధ్యాయ ఓటర్లు ఓటు వేసేందుకు సిబ్బందికి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్టు తహసీల్దార్ తెలిపారు.

●వీరఘట్టం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టం పోలింగ్ కేంద్రానికి బుధవారంఎన్నికల సిబ్బంది చేరుకున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగే పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు.

●సీతంపేట రూరల్,ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): సీతంపేట గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని పాలకొండ డీఎస్పీ రాంబాబు, తహసీల్దార్ పి.అప్ప లరాజులు బుధవారం పరిశీలించారు. 163 బీఎన్ఎస్ఎస్ సెక్షన్ అమలులో ఉండడంతో బయట వ్యక్తులను లోపలికి అనుమతించవొద్దని రాంబాబు పోలీస్ సిబ్బందికి ఆదేశించారు. ఎన్నిక నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లపై తహసీల్దార్ అప్పలరాజు సిబ్బందికి సూచనలు చేసారు. వీరి వెంట ఎస్ఐ వై .అమ్మన్నరావు,పోలీస్,రెవెన్యు సిబ్బంది ఉన్నారు.



సీతంపేట రూరల్: పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ అప్పలరాజు

శంభో శంకర

●భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు

జిల్లాలో మహాశివరాత్రిని భక్తిశ్రద్ధలతో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు తెల్లవారుజాము నుంచే శివాలయాలను దర్శించుకున్నారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలి రావడంతో క్యూలైన్లల్లో భక్తులు బారులుతీరారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకుండా పోలీసలు బందోబస్తు ఏర్పాటు చేశారు.పలు స్వచ్ఛంద సంస్థలు తాగునీటి సదుపాయంతోపాటు ప్రసాద వితరణ కార్యక్రమాలు ఏర్పాటు చేశాయి. పలు ఆలయాల ఆవరణల్లో ఏకాహం నిర్వహించారు. పార్వతీపురం మండలంలోని అడ్డాపుశీల కాశీ విశ్వేశ్వర ఆలయంలో భక్తులు విశేష పూజలు చేశారు. అనంతరం ఆలయంలో సామూహిక రుద్రాభిషేకాలు నిర్వహించారు. సాలూరు మండలం మంచాడవలస, గుమ్మలకొండ గుహాలయాల్లోనూ ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. -ఆంధ్రజ్యోతి బృందం



పాచిపెంట: పారమ్మతల్లికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న మంత్రి సంధ్యారాణి



మక్కువ:ములక్యాయవలస కాశీవిశ్వేశ్వరాలయంలో..



వీరఘట్టం:కిమ్మి శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



సాలూరురూరల్: సాలూరులోని పంచముఖేశ్వరాలయంలో అఖండ జ్యోతిని వెలిగించిన దృశ్యం



సాలూరు రూరల్: గుమ్మలకొండ గుహాలయంలో పూజలందుకున్న శివలింగం



సాలూరు: పంచముఖేశ్వరాలయంలో బారులుతీరిన భక్తులు



కొమరాడ:గుంప సోమేశ్వరుడిని దర్శించుకుంటున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి



పార్వతీపురం రూరల్ : అడ్డాపుశీల శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర



గరుగుబిల్లి:గిజబలో శివపార్వతులను పల్లకిలో ఊరేగిస్తున్న భక్తులు



పాలకొండ: పట్టణంలోని సనారీ విశ్వేశ్వర స్వామి దర్శనానికి వేచి ఉన్న భక్తులు

నిధులు మంజూరుకాక.. నిర్మాణానికి నోచుకోక

- రాళ్లు తేలడంతోపాటు గోతులమయమైన వైనం
- ఇదీ దశమంతుపురం-పెద్దబుడ్డిడి రహదారి దుస్థితి

వీరఘట్టం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టం మండలంలోని దశమంతుపురం నుంచి జియమ్మవలస మండలంలోని పెద్దబుడ్డిడి వరకూ గల రహదారి నిర్మాణానికి నిధులు మంజూరుకాకపోవడంతో నిర్మాణానికి నోచుకోవడం లేదు. ఈ మార్గం బీటీ రహదారిగా అభివృద్ధి చేయడానికి నిధులు మంజూరు చేయాలని దశాబ్దాలుగా స్థానికులు కోరుతున్నారు. ఈ రోడ్డు రాళ్లు తేలి గోతులమయంకావడంతో వీరఘట్టం, జియమ్మవలస మండలాల వాహనచోదకులు, పాదచారులు, ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో దశమంతుపురం గ్రామం శ్రీకాకుళం జిల్లాలోని పెద్దబుడ్డిడి విజయనగరం జిల్లాలోని ఉండడంతో రహదారి అభివృద్ధికి ఆటంకాలు ఎదురయ్యేవి. ప్రస్తుతం రెండు గ్రామాలు పార్వతీపురం జిల్లాలోనే ఉండడంతో బీటీ రహదారి మంజూరవుతాయని ఇక్కడి ప్రజలు ఆశతో ఉన్నారు. ఈ రహదారి పూర్తయితే పాలకొండ, కురుపాం నియోజకవర్గాల ప్రజల రహదారి కష్టాలు గట్టెక్కుతాయి. కాగా ఈ రహదారి పూర్తిచేస్తే వీరఘట్టం మండలం నుంచి వివిధ ప్రాంతాలకు రాకపోకలకు వీలు కలుగుతుందని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణకు దశమంతుపురం గ్రామస్థులు ఇటీవల వినతిపత్రం అందజేశారు.



గోతులమయమైన దశమంతుపురం రహదారి

రాయగడ నుంచి రైలు వేయాలి

గుమ్మలక్ష్మీపురం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఒడిశాలోని రాయగడ రైల్వే డివిజన్‌గా ఏర్పాటుచేయడంతో అక్కడి నుంచి పార్వతీపురం, విజయనగరం, విశాఖపట్నం మీదుగా విజయవాడ, గుంటూరుకు ఎక్స్‌ప్రెస్ రైలు నైట్ సర్వీస్ సదుపాయం కల్పించాలని రైల్వే ప్రయాణికులు సంఘం ఎన్‌జీవో అసోసియేషన్ రెడ్‌క్రాస్ లైన్స్‌క్లబ్ కిషోర్, ఇతర సంస్థల ప్రతినిధులు శ్రీరామ్మూర్తి, బీఎన్‌బీరావు ఒకప్రకటనలో కోరారు.ఈ సదుపాయం కల్పిస్తే అమరావతి వెళ్లడానికి ప్రజలకు, ఉద్యోగులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.ఎమ్మెల్యేలు, ఎంపీలు ఈ రైలు సర్వీసుకు చొరవ చూపాలని కోరారు.

గ్యాస్ లీకై చెలరేగిన మంటలు

పార్వతీపురంటౌన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురంలో ఓ ఇంట్లో గ్యాస్ లీక్‌కావడంతో మంటలు చెలరేగాయి. సకాలంలో అగ్నిమాపక సిబ్బంది స్పందించడంతో ప్రమాదం తప్పింది. పార్వతీపురం అగ్నిమాపక అధికారి జి. ప్రభాకరరావు కథనం మేరకు.. పట్టణంలోని గాంధీసత్రం వీధిలో గల తాత్రాజ్ జగదీష్ నివాసంలో బుధవారం ఉదయం పది గంటల ప్రాంతంలో గ్యాస్ లీకు కావడంతో మంటలు చెలరేగాయి. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బందితో హుటాహుటిన వెళ్లి మంటలను అదుపు చేశారు

నేడు దుగ్గేరులో వైద్య శిబిరం

మక్కువ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుగ్గేరులో శంబర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యసిబ్బందితో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించనున్నట్టు ఎస్ఐ ఎం.వెంకటరమణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజనులు వైద్య శిబిరానికి హాజరై వైద్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఉచితంగా మందులు అందజేయనున్నట్లు తెలిపారు.